అదునులో అందని సబ్సిడీ విత్తనాలు

- రిజిస్ట్రేషన్‌కు యాప్ పనిచేయలేదని సాకులు
- బయట మార్కెట్లలో విత్తనాలు తెచ్చుకుని సాగు


రబీలో మినుము సాగు చేస్తున్న రైతులు

వేముల : రబీ సాగుకు సకాలంలో వర్షాలు కురిసి భూములు పదును అవ్వగా.. ప్రభుత్వం అందించే సబ్సిడీ విత్తనాలు మాత్రం రైతులకు అందడంలేదు. రైతుల ఆశలకు అనుగుణంగా వర్షాలు కురిశాయి. రబీలో ఎక్కువ విస్తీర్ణంలో రైతులు మినుము, పెసర సాగుపై దృష్టి సారించారు. అదునులో ప్రభుత్వం అందించే సబ్సిడీ విత్తనాలు అందకపోవడంతో రైతులు బయట మార్కెట్‌లో కొనుగోలు చేసి తెచ్చుకుని సాగు చేస్తున్నారు. ఖరీఫ్‌లో వర్షాలులేక పంటలు సాగు చేయలేదు. అక్టోబరు నెల ప్రారంభమై 15రోజులు దాటినా సబ్సిడీ విత్తనాలు ఎప్పుడిస్తారని అడుగుతున్న రైతులకు స్పష్టమైన సమాధానం లేకుండాపోతోంది. విత్తనాల కోసం ఎవరిని అడిగితే సమాధానం వస్తుందో తెలియని పరిస్థితిలో రైతులు ఉన్నారు.

నియోజకవర్గంలో 50వేల ఎకరాల్లో సాగు

పులివెందుల నియోజకవర్గంలో బుడ్డ శనగ 50 వేల ఎకరాలలో సాగవుతుందని అంచనా. ఇప్పటికే ఎరువులు, సేద్యాల కోసం ఖర్చు చేసిన రైతులు సబ్సిడీ విత్తనాల కోసం ఎదురు చూస్తున్నారు. నియోజకవర్గానికి బుడ్డశనగలు, మినుములు, పెసర విత్తనాలను కేటాయిస్తూ వారం రోజుల క్రితమే ఉత్తర్వులు వచ్చాయి. అయితే ఇప్పటివరకు బుడ్డశనగ విత్తనాల పంపిణీ ఎప్పుడు ఉంటుందో చెప్పలేని పరిస్థితిలో అధికారులు ఉన్నారు. నియోజకవర్గంలోని ఆయా రైతు సేవా కేంద్రాలలో కూడా సబ్సిడీ విత్తనాల పంపిణీపై స్పష్టత లేకపోవడంతో రైతులు విత్తనాల కోసం వేచి చూడక తప్పలేదు. బయట మార్కెట్‌లో క్వింటా బుడ్డ శనగలు రూ.6300ల నుంచి రూ.6500ల వరకు ధర పలుకుతోందని రైతులు అంటున్నారు. అలాగే రవాణా ఖర్చులు అదనం అవుతున్నాయి. ఇప్పటికే మినుములు, పెసర విత్తనాలను బయట మార్కెట్లలో కొనుగోలు చేసి సాగు చేస్తున్నారు. శనగ పంటను ఈనెల 20 నుంచి సాగు చేయనున్నారు. కొంతమంది రైతులు గ్రూపుగా ఏర్పడి శనగ విత్తనాలను తెచ్చుకుంటున్నారు.

మండలాల వారీగా మంజూరైన విత్తనాలు

మండలం	బుడ్డశనగలు క్వింటాళ్లలో	మినుములు క్వింటాళ్లలో	పెసలు క్వింటాళ్లలో
పులివెందుల	500	05	05
వేంపల్లె	1000	35	20
వేముల	1400	25	10
తొండూరు	1200	20	05
సింహాద్రిపురం	2700	20	15
లింగాల	1000	--	--
చక్రాయపేట	---	--	--

రైతులకు సబ్సిడీ విత్తనాలు అందిస్తాం

రబీ సాగుకు రైతులకు సబ్సిడీ విత్తనాలు అందిస్తాం. విత్తనాలకు రిజిస్ట్రేషన్ యాప్ పనిచేయలేదు. మరో రెండు రోజుల్లో యాప్ పనిచేస్తుంది. రైతులతో రిజిస్ట్రేషన్ చేయించి విత్తనాలు పంపిణీ చేస్తాం. అదునులో విత్తనం పడేలా విత్తనాలు ఇస్తామని రైతులు ఆందోళన చెందవద్దు.

– ప్రభాకర్‌రెడ్డి, ఏడీఏ, పులివెందుల

విత్తనాల కోసం ఎదురుచూస్తున్నాం.


అదునులో వర్షాలు కురిశాయి. రబీ శనగ పంట సాగు చేస్తున్నా.. సబ్సిడీ విత్తనాలు ఇంకా పంపిణీ చేయలేదు. విత్తనాల కోసం ఎదురుచూస్తున్నాం. విత్తనాలు ఎప్పుడు ఇస్తారో చెప్పడంలేదు. అదును దాటిపోయాక విత్తనాలు ఇచ్చినా ప్రయోజనం ఉండదు.

– చలపతి, రైతు, వేముల

బయటి మార్కెట్‌లో తెచ్చుకున్నా


రబీలో అదునులో పంటలు సాగవుతున్నాయి. సబ్సిడీపై మినుములు ఇంకా పంపిణీ చేయలేదు. అదును దాటుతుందని బయటి మార్కెట్‌లో మినుములు తెచ్చుకుని సాగు చేస్తున్నాం. కిలో మినుములు రూ.150ల నుంచి రూ.200లతో కొనుగోలు చేశాం. సబ్సిడీ విత్తనాల కోసం ఎదురుచూస్తే అదును దాటుతుందనే బయట తెచ్చి సాగు చేశాం.

– శివశంకర్‌రెడ్డి, రైతు, మబ్బుచింతలపల్లె

క్లుప్తంగా

వినూత్న నిరసన


పోలీస్ స్టేషన్ వద్ద రోడ్డుపై పడిన గుంతల్లో మొక్కలు నాటి నీరు పోస్తున్న పట్టణ యువకులు

కమలాపురం : ప్రధాన రహదారిపై పడిన పెద్ద పెద్ద గుంతలను పూడ్చాలని పట్టణ యువత వినూత్నంగా నిరసన చేపట్టారు. బుధవారం పట్టణంలోని రైల్వే గేటు నుంచి క్రాస్ రోడ్డు వరకు ప్రధాన రహదారిలో ఉన్న గుంతలను పూడ్చి జరిగే ప్రమాదాలను నివారించాలని పట్టణ యువకులు జూటూరు విజయ్, శీలం శ్రీనివాసులు మొక్కలు నాటి, నీరు పోసి వినూత్నంగా నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైల్వే గేటు నుంచి క్రాస్ రోడ్డు వరకు ప్రధాన రహదారిపై పెద్ద పెద్ద గుంతలు పడ్డాయని, ఈ గుంతల్లో వాహన చోదకులు పడి తీవ్రంగా గాయపడుతున్నారని వారు ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి గుంతలు పూడ్చి జరిగే ప్రమాదాలను నివారించాలని వారు కోరారు.

భూసార పరీక్షల ఫలితాల ఆధారంగా ఎరువులను వాడాలి

వేంపల్లె : భూసార పరీక్షల ఫలితాలను బట్టి సిఫార్సు చేసిన ఎరువులను వాడాలని ఏడీఏ అశోక్‌రెడ్డి తెలిపారు. బుధవారం అలిరెడ్డిపల్లె, ఇడుపులపాయ గ్రామాల్లో భూసార పరిరక్షణ పథకంపై రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన భూసార పరీక్ష ఫలితాల ఆధారంగా ఎరువులను వాడే విధానంపై రైతులకు అవగాహన కల్పించారు. ఏడీఏ మాట్లాడుతూ రైతులు విత్తనం వేసేటప్పుడు తప్పనిసరిగా విత్తనశుద్ధి చేసుకోవాలన్నారు. అనంతరం ఆయన భూసార పరీక్షా ఫలితాల పత్రాలతోపాటు పాడి పంటలు నెలవారీ మాసపత్రిక పుస్తకాలను రైతులకు అందించారు. కార్యక్రమంలో ఏఓ శివశంకర్‌రెడ్డి, వ్యవసాయ, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

సమాజంలో మహిళా ఆరోగ్యం ప్రధానం


మాట్లాడుతున్న డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ మల్లయ్య

తొండూరు : ఆరోగ్యవంతమైన సమాజం కోసం మహిళల ఆరోగ్యం ప్రధానమని డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ మల్లయ్య తెలిపారు. బుధవారం ఇనగలూరు గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రం–2లో అంతర్జాతీయ బాలికల దినోత్సవాన్ని పురస్కరించుకుని సేవ్ ది గర్ల్ చైల్డ్ అనే కార్యక్రమం నిర్వహించారు. బాలికల శాతం తక్కువగా ఉండటంవలన సమాజంలో అసమానతలు, అకృత్యాలు, దాడులు జరిగి స్త్రీ మనుగడకే ప్రమాదమన్నారు. భ్రూణ హత్యలకు స్వస్తి పలకాలని, లింగనిర్ధారణ చట్టరీత్యా నేరమన్నారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ శశికళ, సీహెచ్‌ఓ శిరీష, మహిళా పోలీసు సునీత, వెల్ఫేర్ అసిస్టెంట్ హరిప్రసాద్, ఆరోగ్య కార్యకర్త మధుర, అంగన్‌వాడీ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

వాల్మీకులను ఎస్టీలలో కలపాలి

జమ్మలమడుగు : ప్రధాన మంత్రి నరేంద్రమోదీ వాల్మీకులను ఎస్టీలలో కలుపుతామంటూ స్పష్టమైన హామీని ప్రకటించాలని వాల్మీకి రిజర్వేషన్ ప్రజా సమితి యూత్ అధ్యక్షుడు నొస్సం వెంకటసుబ్బయ్య డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక ఎన్జీఓ కార్యాలయం వద్ద ఆయన విలేకరులతో మాట్లాడారు. ఏపీ ప్రభుత్వం 2017లో అసెంబ్లీలో వాల్మీకులను ఎస్టీలుగా పునరుద్ధరించేటందుకు అన్ని విధాలుగా అర్హులు అని తీర్మానం చేసి కేంద్రానికి పంపితే 2018లో కేంద్ర ప్రభుత్వ అనుబంధ సంస్థలైనా ఆర్‌జీఎల్, ఎస్సీ, ఎస్టీ కమిషన్ నవరణ పేరుతో వెనక్కి పంపిందన్నారు. నరేంద్ర మోదీ ఇచ్చిన మాట ప్రకారం ఎస్టీలలో వాల్మీకిలను కలుపుతామని స్పష్టమైన ప్రకటనను గురువారం కర్నూల్‌లో జరిగే బహిరంగ సభలో ప్రకటన చేయాలన్నారు.

ఉక్కు పరిశ్రమ సంగతేంటి

వేంపల్లె : కడప ఉక్కు పరిశ్రమ సంగతేమిటని, రాష్ట్ర విభజన హామీల ఊసే లేదని సీపీఐ జిల్లా కార్యదర్శి గాలిచంద్ర పేర్కొన్నారు. బుధవారం వేంపల్లెలోని స్థానిక ఎస్టీయూ కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. పీఎం నరేంద్ర మోదీ రాష్ట్రానికి ప్రత్యేక హోదా, రాయలసీమకు ప్రత్యేక ప్యాకేజీ, కడప ఉక్కు పరిశ్రమ, ఆర్థిక లోటు భర్తీ, పోలవరం పూర్తి వంటి అంశాలను పూర్తిగా పక్కనపెట్టారని విమర్శించారు. రాష్ట్రానికి, రాయలసీమకు ఎలాంటి ప్రయోజనం చేకూర్చని ప్రధాని నరేంద్ర మోడీని చంద్రబాబు ప్రభుత్వం రాయలసీమకు ఆహ్వానించడం సిగ్గుచేటు అన్నారు. రాయలసీమలో చేపట్టిన నీటిపారుదల ప్రాజెక్టులైన గాలేరు నగరి, హంద్రీనీవా, తెలుగు గంగ ప్రాజెక్టులకు జాతీయ హోదా కల్పించాలన్నారు. కార్యక్రమంలో సీపీఐ పులివెందుల ఏరియా కార్యదర్శి వెంకట రాములు, ఏరియా సహాయ కార్యదర్శులు కొత్త కాలువ బ్రహ్మం, అంజనప్ప, తదితరులు పాల్గొన్నారు.

నేడు వైఎస్సార్ ఆడిటోరియంలో సమావేశం

పులివెందుల : పట్టణంలోని స్థానిక భాకరాపురంలోని వైఎస్సార్ ఆడిటోరియంలో గురువారం వైఎస్సార్‌సీపీ సమావేశం ఏర్పాటు చేసినట్లు వైఎస్సార్‌సీపీ పార్టీ వర్గాలు తెలిపాయి. ఈ సందర్భంగా నియోజకవర్గంలోని పులివెందుల మున్సిపాలిటీ, పులివెందుల రూరల్, సింహాద్రిపురం, లింగాల, తొండూరు మండలాలకు సంబంధించిన పార్టీ నాయకులు, కార్యకర్తలతో సమావేశం ఏర్పాటు చేశారు. గురువారం ఉదయం 9 గంటలకు వైఎస్సార్ ఆడిటోరియం వద్దకు ఆయా మండలాలకు సంబంధించిన పార్టీ నేతలు, కార్యకర్తలు హాజరు కావాలని పార్టీ వర్గాలు కోరారు. ఈ సమావేశానికి ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి హాజరు కానున్నారు. సమావేశం సందర్భంగా ఎంపీ మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కోటి సంతకాల సేకరణ, వైఎస్సార్‌సీపీ గ్రామ, వార్డు కమిటీల ఏర్పాటు విషయమై దిశానిర్దేశం చేయనున్నారు.

రేపు కోటి సంతకాల సేకరణ

వేంపల్లె : ప్రజా వైద్యం – ప్రజల హక్కు మెడికల్ కాలేజీ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా శుక్రవారం కోటి సంతకాల ప్రజా సేకరణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి సింగారెడ్డి వెంకట సతీష్‌కుమార్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. శుక్రవారం ఉదయం 9 గంటలకు స్థానిక హనుమాన్ జంక్షన్ సమీపంలో ఉన్న మధురెడ్డి ఫంక్షన్ హాలులో వేముల, వేంపల్లె, చక్రాయపేట మండలాలకు సంబంధించి సమావేశం ఉంటుందని తెలిపారు. అలాగే వైఎస్సార్‌సీపీ గ్రామ, వార్డుల కమిటీ ఏర్పాటు ఉంటుందన్నారు. నాయకులు, కార్యకర్తలు, పెద్ద ఎత్తున పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

రేపు ప్రముఖ వైద్య నిపుణురాలు రాక

పులివెందుల : పట్టణంలోని స్థానిక భాకరాపురంలో ఉన్న దినేష్ మెడికల్ సెంటర్(గంగిరెడ్డి ఆసుపత్రి)లో శుక్రవారం ప్రముఖ వైద్య నిపుణులు రానున్నట్లు ఆసుపత్రి వర్గాలు తెలిపాయి. ప్రముఖ చర్మవ్యాధుల వైద్య నిపుణురాలు డాక్టర్ శుక్రవారం ఉదయం 11.45 గంటల నుంచి మధ్యాహ్నం 3.30 గంటలవరకు సోరియాసిస్, తామర, గజ్జి, ఫంగస్ ఇన్‌ఫెక్షన్, మొటిమలు, బెదులు, దద్దుర్లు, చుండ్రు, బొల్లి, పెదాలు, నోట్లో పక్కులు సలిపిరి, తల్లి (అమ్మవారు), సభ్యం(శోభి), మాగురు(మంగు), అలర్జీ, ఆనెలు, కాళ్లు పగులుట, పులిపిర్లు, పేను కొరుకుట, జుట్టు రాలుట, గోర్లు పుచ్చుట, ముఖం మీద మచ్చలు, చర్మంపై టీబీ మచ్చలు, కుష్ఠు, తదితర చర్మ వ్యాధులకు వైద్య పరీక్షలు నిర్వహించనున్నారు. చెవి, ముక్కు, గొంతు వ్యాధుల శస్త్ర చికిత్స వైద్య నిపుణులు డాక్టర్ ఉదయం 9.45 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు చెవిలో చీము కారుట, చెవి నొప్పి, చెవిలో శబ్దములు, చెవిలో కర్ణబేరికి రంధ్రం, చెవిటి మిషన్లు అమర్చడం, చెవిలో బలపాలు, పూసలు తీయుట, ముక్కు దూలం సరిచేయుట, అలర్జీ, సైనసైటిస్, ముక్కులో రక్తం కారుటకు, ముక్కులో బలపాలు, పూసలు తీయుట, ముక్కులో గడ్డలకు, ఎండోస్కోపి సైనస్ సర్జరీ, గొంతులో గడ్డలకు శస్త్ర చికిత్స, స్వర పేటికలో లోపాలకు చికిత్స, గొంతులో ఇరుక్కుపోయిన చేప ముల్లులు, నాణేలు తీయుట, గొంతులో ఇన్‌ఫెక్షన్‌కు మాటలు రానివారికి చికిత్స, తలనొప్పి, తల తిరుగుట చికిత్స, తదితర వాటికి వైద్య పరీక్షలు నిర్వహిస్తారు. ఈ అవకాశాన్ని పులివెందుల ప్రాంత ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు 9963170177, 08568286189 అనే ఫోన్ నెంబర్లకు సంప్రదించాలన్నారు.

మహిళల భద్రతకు శక్తి యాప్ వరం లాంటిది


మాట్లాడుతున్న పులివెందుల అర్బన్ సీఐ సీతారామిరెడ్డి

వేంపల్లె : మహిళల భద్రతకు శక్తి యాప్ వరం లాంటిదని పులివెందుల అర్బన్ సీఐ సీతారామిరెడ్డి తెలిపారు. బుధవారం వేంపల్లెలోని స్థానిక వైఎస్సార్ వివేకానంద ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రధానమంత్రి ఉచ్చతర శిక్ష అభియాన్ పథకం కింద మహిళల చైతన్యం కొరకు శక్తి యాప్ గురించి విద్యార్థినులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకు పులివెందుల అర్బన్ సీఐ ముఖ్య అతిథిగా హాజరై మహిళలు ఎదుర్కొనే సంక్లిష్ట సమస్యలకు శక్తి యాప్ ఒక రక్షక భటుడు మీ వెంట ఉన్నట్టేనని, ఈ యాప్‌ను ప్రతి ఒక్కరు తమ ఆండ్రాయిడ్ మొబైల్‌లలో ఇన్‌స్టాల్ చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఉషా పథకం కో ఆర్డినేటర్ డాక్టర్ సతీష్, కళాశాల ప్రిన్సిపాల్ నాగేంద్ర, ప్రొగ్రాం కో ఆర్డినేటర్ ఓబుల్‌రెడ్డి, పీడీ తేజ, అధ్యాపకులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

ఉల్లి రైతులను ఆదుకోవాలి


ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డికి తమ ఆవేదన వ్యక్తం చేస్తున్న సాయినాథ శర్మ, రైతులు

కమలాపురం : ఉల్లి పంట సాగు చేసి తీవ్రంగా నష్టపోయిన కమలాపురం నియోజకవర్గ రైతాంగాన్ని ఆదుకోవడానికి రాష్ట్ర ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలని వైఎస్సార్‌సీపీ ఎస్ఈసీ సభ్యుడు సత్య సాయినాథ శర్మ కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డికి విన్నవించారు. బుధవారం పులివెందులలో ఉల్లి రైతులతో ఎంపీని కలసి ఆయన ఉల్లి రైతుల బాధలను విన్నవించారు. కర్నూలు జిల్లా రైతులకు ప్రభుత్వం ప్రకటించిన హెక్టార్‌కు రూ.50వేల నష్ట పరిహారాన్ని కడప జిల్లా రైతులకు కూడా వర్తింపచేసేలా అధికార యంత్రాంగంపై ఒత్తిడి తేవాలని ఆయన ఎంపీని కోరారు. స్పందించిన ఎంపీ మట్లాడుతూ ఉల్లి రైతుల కష్టాలు తెలుసుకున్నానని, జిల్లా కలెక్టర్‌తో చర్చలు కూడా జరిపామని, జిల్లాలోని ఉల్లి రైతులకు ఆర్థిక సాయం చేపించడానికి శాయశక్తుల కృషి చేస్తానన్నారు. అనంతరం సాయినాథ్ శర్మ మీడియాతో మాట్లాడుతూ జగనన్న ప్రభుత్వంలోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యం అయిందన్నారు. ప్రస్తుతం ఉన్న కూటమి ప్రభుత్వ పాలనలో పేద ప్రజలకు తీవ్ర అన్యాయం జరుగుతోందని, అభివృద్ధి పనులు ఎక్కడికక్కడే స్థంబించి పోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. తన నియామకానికి తోడ్పడిన మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి, ఎంపీ అవినాష్‌రెడ్డికి, జిల్లా అధ్యక్షుడు రవీంద్రనాథ్‌రెడ్డికి ఆయన కృతజ్ఞతలు తెలియజేశారు. తనకు అందిన బాధ్యతను సమర్థవంతం నెరవేర్చుతానని శక్తి వంచన లేకుండా పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

ఉక్కు ఫ్యాక్టరీ ఏర్పాటుపై ప్రధాని ప్రకటన చేయాలి

కమలాపురం : కర్నూలు జిల్లా పర్యటనకు వస్తున్న ప్రధాని నరేంద్ర మోదీ వైఎస్సార్ కడప జిల్లాలో ఉక్కు ఫ్యాక్టరీ ఏర్పాటు చేస్తామని ప్రకటన చేసేలా కూటమి నాయకులు చర్యలు తీసుకోవాలని డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు చిన్ని, కార్యదర్శి వీరనాల శివకుమార్ డిమాండ్ చేశారు. బుధవారం కమలాపురంలో నిర్వహించిన మీడియా సమావేశంలో వారు మాట్లాడారు. ముగ్గురు సీఎంలు మూడు శిలాఫలకాలు వేసిన ఘనత దేశంలోనే ఒక్క కడప ఉక్కు కే సాధ్యమన్నారు. 2018 ఫిబ్రవరి 13న బీజేపీ కర్నూలులో రాయలసీమ డిక్లరేషన్ పేరుతో వెనుకబడిన ప్రాంతాలకు 20వేల కోట్ల నిధులను కేటాయించాలని డిమాండ్ చేసిందన్నారు. ప్రస్తుతం కేంద్రంలోనూ, రాష్ట్రంలోనూ కూటమి ప్రభుత్వం అధికారంలో కొనసాగుతుందన్న నేపథ్యంలో బీజేపీ డిక్లరేషన్ అమలు చేయాలని వారు డిమాండ్ చేశారు. ఉక్కు ఫ్యాక్టరీ ఏర్పాటు చేస్తే 25 వేల మందికి ప్రత్యక్షంగా, లక్ష మందికి పరోక్షంగా ఉపాధి లభిస్తుందన్నారు. కర్నూలు పర్యటనలో కూటమి నాయకులు ప్రధానికి ఒప్పించి రూ.20వేల కోట్లు ప్రకటించేలా కృషి చేయాలని వారు డిమాండ్ చేశారు.

పేద విద్యార్థుల జీవితాల్లో వెలుగులు నింపాలి

వేంపల్లె : పేద విద్యార్థుల జీవితాల్లో ప్రభుత్వ ఉపాధ్యాయులు విద్యా వెలుగును నింపాలని యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు నక్కా వెంకటేశ్వర్లు పిలుపునిచ్చారు. బుధవారం వేంపల్లె, వేముల, చక్రాయపేట మండలాల్లోని వివిధ ప్రభుత్వ పాఠశాలలను యూటీఎఫ్ నాయకులు సందర్శించి ఇటీవల మెగా డీఎస్సీ ద్వారా విధులు చేపట్టిన నూతన ఉపాధ్యాయులకు అభినందనలు తెలిపారు. ఎంతో నమ్మకంతో, విశ్వాసంతో ప్రభుత్వ పాఠశాలకు విద్యనభ్యసించడానికి వచ్చే పేద విద్యార్థులకు నాణ్యమైన విద్యనందించడానికి ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో యూటీఎఫ్ రాష్ట్ర సహాధ్యక్షులు కె.సురేష్ కుమార్, రాష్ట్ర కార్యదర్శి లక్ష్మీరాజా, యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు విజయకుమార్, పాలెం మహేష్ బాబు, జిల్లా కార్యదర్శులు చెరుకూరి శ్రీనివాసులు, సి.వి.రమణ, యూటీఎఫ్ నాయకులు, ఎంఈఓలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఇ-పంట నమోదు త్వరగా పూర్తి చేయాలి


వేముల : బీడు భూములలో ఇ-పంట నమోదును పరిశీలిస్తున్న జేడీఏ చంద్ర నాయక్

వేముల : గ్రామాల్లో క్షేత్రస్థాయిలో ఇ-పంట నమోదును త్వరగా పూర్తి చేయాలని జిల్లా వ్యవసాయాధికారి చంద్రనాయక్ తెలిపారు. మండలంలోని చాగలేరు, పెద్దజూటూరు రైతు సేవా కేంద్రాలను బుధవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేసి మాట్లాడారు. బీడు భూములలో కూడా ఇ-పంట నమోదు చేయాలని, పంట లేకుంటే నో పంట, పంట సాగులో ఉంటే ఏ పంట సాగైందో ఇ-పంటగా నమోదు చేయాలన్నారు. ఈనెల 20వ తేదీలోగా ఇ-పంట నమోదు పూర్తి చేయాలని, లేనిఎడల రైతులకు రావాల్సిన ఇన్‌పుట్స్ అందవన్నారు. రబీ సాగుకు రెండు, మూడు రోజుల్లో విత్తన పంపిణీ ఉంటుందన్నారు. బీడు భూములలో చేపడుతున్న ఇ-పంట నమోదును పరిశీలించారు. రబీ సీజన్‌లో పంటల సాగు వివరాలను రైతులను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఏఓ ఓబులేసు, ఏఈఓ సురేష్, వీఏఏ ప్రసన్న, రైతులు పాల్గొన్నారు.


మెలవరం : ప్రకృతి వ్యవసాయం ద్వారా పండించిన పంటలను అమ్మకాలు చేస్తున్న దృశ్యం

మైలవరం..

మైలవరం : ప్రకృతి వ్యవసాయం ద్వారా పండించిన పంటలను వాడితే ప్రజలు ఆరోగ్యకరంగా ఉంటారని సబ్ డివిజన్ యాంకర్ లక్ష్మీ, ఐక్రాప్ గోపాల్‌రెడ్డిలు పేర్కొన్నారు. బుధవారం తొర్రివేముల, కర్మలవారిపల్లె సర్కిల్ వద్ద ఉన్న ప్రకృతి వ్యవసాయానికి సంబంధించిన ఆకుకూరలు, కూరగాయాల స్టాల్‌ను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ప్రజలకు ప్రకృతి వ్యవసాయం గురించి, అందులో పండించిన పంటలను అమ్మకాలు చేశారు. వీటితో పాటు 8 రకాలకు సంబంధించిన కూరగాయాల ప్యాకెట్లను సీడ్ కిడ్స్ పేరుతో ఒక్కొక్కటి 50 రూపాయల చొప్పున రైతులకు అందించారు. బయట వీటి ధర రూ. 80 నుంచి రూ.100 వరకు ఉంటుందని తాము ఇచ్చిన కిడ్స్‌లో మిరప, టమోటా, గోంగూర, బెండ, కాకరకాయ, వంకాయ, కూరగాయాలకు సంబంధించిన విత్తనాలు ఉంటాయన్నారు.

రాజకీయాలకు అతీతంగా విధులు నిర్వహించాలి


సమావేశంలో పలు అంశాలను చర్చిస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు

చింతకొమ్మదిన్నె : స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో బుధవారం ఉప మండలాధ్యక్షుడు గజ్జల వెంకటసుధాకరరెడ్డి అధ్యక్షతన మండల సమావేశం జరిగింది. వేదికపై అర్హతలేని సహకార సొసైటీ పర్సన్ ఇన్‌చార్జి ఆశీనులు కావడంతో కాసేపు కలకలం రేగి చివరకు ఎంపీడీఓ కులాయిబాబు ఆదేశాలతో వేదిక నుంచి వెళ్లిపోవడంతో సమావేశం సజావుగా జరిగింది. సమావేశంలో ఉప మండలాధ్యక్షుడు సుధాకరరెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ అధికారులు, ప్రజాప్రతినిధులు అభివద్ధికి కొరకు రాజకీయాలకు అతీతంగా ప్రభుత్వ కార్యకలాపాలు నిర్వహించాలని కోరారు. వ్యవసాయ శాఖపై సమీక్షలో తాడిగొట్ల, కొప్పర్తి సచివాలయ పరిధిలోని గ్రామాలకు సంబంధించి వ్యవసాయ సహాయకులు లేరని అధికారులు వెంటనే నియమించాలని కోరారు. మండల విద్యాశాఖ అధికారి రమాదేవి మాట్లాడుతూ టి.కృష్ణాపురం, కొలుములపల్లెలోని పాఠశాలల నిర్మాణానికి ప్రభుత్వం నుంచి అనుమతులు వచ్చాయని అధికారులు, నాయకులు స్థల ఏర్పాటుకు సహకరించాలని కోరారు. పశు సంవర్ధక శాఖ, విద్యుత్, ఉపాధి, ఇరిగేషన్, వెలుగు, హౌసింగ్ తదితర శాఖల అధికారులు వారికి సంబంధించిన నివేదికలను తెలిపారు. సమావేశంలో ఎంపీడీఓ కుల్లాయిబాబు, కో ఆప్షన్ సభ్యుడు సిద్దిమాబు, ఎంపీటీసీ సభ్యులు వనజ, పద్మజ, వెంకటరెడ్డి, మల్లిక, అరుణ, సర్పంచులు సుజాత, సురేంద్ర, మహేశ్వరి, విజయలక్ష్మి, సుబ్బరాయుడు, సుబ్బమ్మ, సాలక్క, స్వాతి, పంచాయతీ కార్యదర్శులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

పరిశుభ్రతపై జాగ్రత్తగా ఉండాలి


మాట్లాడుతున్న ప్రొగ్రాం అధికారి నాగమహేశ్వరరెడ్డి

ఎర్రగుంట్ల : ప్రతి వ్యక్తి పరిశుభ్రత పట్ల జాగ్రత్తగా ఉండి సమాజాన్ని శుభ్రంగా ఉంచడం తమ బాధ్యతగా భావించాలని ఎన్ఎస్ఎస్ ప్రొగ్రాం అధికారి నాగమహేశ్వరరెడ్డి తెలిపారు. బుధవారం స్థానిక జూనియర్ కళాశాలలో ఎన్ఎస్ఎస్ కార్యక్రమాన్ని ప్రిన్సిపాల్ త్రిక్రమ్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్ఎస్ఎస్ వలంటీర్ల శాంతినగర్ కాలనీలో పరిశుభ్రత కార్యక్రమాలు చేపట్టి స్థానికులకు వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో జాతీయ సేవా పథకం కార్యనిర్వహణాధికారి వేణుగోపాల్, అధ్యాపకులు పాల్గొన్నారు.

కబ్జాదారునిపై క్రిమినల్ కేసు నమోదు చేయాలి

వేంపల్లె : మండల పరిధిలో ఉన్న పాములూరు రెవెన్యూకు సంబంధించిన పొలాలను ఆక్రమించిన కబ్జాదారునిపై క్రిమినల్ కేసు నమోదు చేయాలని గ్రేటర్ రాయలసీమ అభివృద్ధి వేదిక కమిటీ కన్వీనర్ కారు ఆంజనేయులు డిమాండ్ చేశారు. బుధవారం వేంపల్లెలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ పాములూరు రెవెన్యూ పొలంలోని సర్వేనెంబర్ 513లో 8 ఎకరాల ప్రభుత్వ భూమిని వేంపల్లె కాపు వీధికి చెందిన టీడీపీ జిల్లా మాజీ ప్రధాన కార్యదర్శి ఎద్దుల శేషారెడ్డి ఆక్రమణ చేసి పత్తి పంటను సాగు చేశారన్నారు. ప్రజా సంఘాల నేతలు వేంపల్లె తహసీల్దార్, పులివెందుల ఆర్డీఓ, డీఆర్‌ఓలకు ఫిర్యాదు చేయడంతో వీఆర్‌ఓ ఆ పొలంలో ప్రభుత్వ స్థలమని సూచిక బోర్డును పెట్టారన్నారు. అయితే ఒకరోజు గడవక ముందే సూచిక బోర్డును కబ్జాదారుడు పీకి వేయడం జరిగిందన్నారు. టీడీపీ నేతల అండదండలతో ప్రభుత్వాన్ని, అధికారులను లెక్కచేయకుండా సూచిక బోర్డును పీకి వేయడం చట్టరీత్యా నేరమన్నారు. కబ్జాదారునిపై తక్షణమే క్రిమినల్ కేసు నమోదు చేయాలని కోరారు. ఈ విషయాన్ని సీఎం చంద్రబాబు, మంత్రి లోకేష్‌లకు లేఖల ద్వారా తెలియజేస్తామని తెలిపారు.

పార్టీ కోసం పనిచేసేవారికి గుర్తింపు ఉంటుంది


కార్యకర్తలతో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ రామసుబ్బారెడ్డి

జమ్మలమడుగు : పార్టీ కోసం పనిచేసే కార్యకర్తలకు, నాయకులకు గుర్తింపు ఉంటుందని ఎమ్మెల్సీ పి.రామసుబ్బారెడ్డి అన్నారు. బుధవారం స్థానిక పార్టీ కార్యాలయంలో మూడు మండలాలకు చెందిన కార్యకర్తలు, నాయకులతో గ్రామ, వార్డు కమిటీలపై ఆయన సమీక్షా సమావేశాన్ని నిర్వహించిన మాట్లాడారు. రాబోయే మున్సిపల్, గ్రామ, ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల్లో పార్టీని బలోపేతం చేసి, ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకుపోవాలన్నారు. సూపర్ సిక్స్ పథకాల తీరు, నిరుద్యోగ భృతి, ఆడబిడ్డ నిధి వంటి పథకాల గురించి, పీపీపీ పేరుతో మెడికల్ కాలేజిలను ప్రైవేట్ పరం చేయడం వంటి అంశాలను ప్రజలలోనికి విస్తృతంగా తీసుకుపోవాలన్నారు. వార్డు, గ్రామ పంచాయతీలలో మూడంచెల పరిశీలకులను నియమించి కార్యకర్తల, నాయకులు పనితీరుపై పర్యవేక్షణ ఉంటుందన్నారు. కాబట్టి ప్రతి కార్యకర్త పార్టీ కోసం పనిచేస్తే అధికారం వచ్చిన తర్వాత వారికి గుర్తింపు ఉంటుందన్నారు. కార్యక్రమంలో మూడు మండలాలకు చెందిన కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు.

కొత్తకుమ్మరాంపల్లెలో వైద్య శిబిరం


జ్వరాల గురించి ఆరా తీస్తున్న డిప్యూటీ డీఎంహెచ్‌ఓ ఖాజామొయినుద్దీన్

సింహాద్రిపురం : మండలంలోని కొత్తకుమ్మరాంపల్లెలో డిప్యూటీ డీఎంహెచ్‌ఓ ఖాజామొయినుద్దీన్ ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన అక్కడ జరుగుతున్న లార్వా సర్వే, ఫీవర్ సర్వే తనిఖీ చేసి జ్వరాలు ఉన్నాయా అని ఆరోగ్య, ఆశా కార్యకర్తలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం వర్షాలు పడుతున్న తరుణంలో జలుబు, దగ్గు, వైరల్ ఫీవర్స్ వచ్చే అవకాశం ఉందన్నారు. ప్రజలు జాగ్రత్తగా ఉండాలన్నారు. ఎవరికైనా జ్వరం వచ్చినట్లయితే వెంటనే స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వెళ్లి వైద్య పరీక్షలు చేయించుకోవాలన్నారు. డెంగీ నిర్ధారణ పరీక్షలు పులివెందుల ప్రభుత్వాసుపత్రిలో మాత్రమే చేస్తారన్నారు. సబ్ యూనిట్ అధికారి సిద్దయ్య మాట్లాడుతూ ప్రతి ఒక్కరు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణ అధికారి సుకుమార్, సీనియర్ అసిస్టెంట్ నరేష్, సూపర్‌వైజర్ విజయలక్ష్మి, సీహెచ్‌ఓ యమున, ఆరోగ్య, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.


పులివెందులలో కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డిని కలసిన ఎమ్మెల్సీ రామసుబ్బారెడ్డి, తదితరులు